స్మార్ట్ తిప్పలు

- రేషన్ కార్డు ఎక్కడ తీసుకోవాలో తెలియక కార్డుదారుల ఆందోళన
- ఇంటి వద్దే కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని నాయకులు, అధికారుల ప్రకటన
- కానీ రేషన్ డిపోల్లోనే జరుగుతున్న పంపిణీ
- నేటికి 20 శాతం కూడా పంపిణీ కాని వైనం

అల్లిపురం: కూటమి ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన స్మార్ట్ కార్డుల పంపిణీలో స్పష్టత లేక రేషన్ కార్డుదారులకు అవస్థలు మొదలయ్యాయి. ఆగస్టు 24న ఏఎస్‌వో కార్యాలయాలకు చేరిన స్మార్ట్ కార్డులను సచివాలయాలకు పంపించారు. అదే నెల 27న ఎంపిక చేసిన సచివాలయాల్లో నియోజకవర్గ, వార్డు స్థాయిలో నాయకులు స్మార్ట్ కార్డుల పంపిణీని ప్రారంభించారు. కొంత మందికి కార్డులు అందజేసి, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వచ్చి స్మార్ట్ కార్డులు అందజేస్తారని ప్రకటించారు. సచివాలయ సిబ్బందిని కార్డుల పంపిణీకి క్లస్టర్ల వారీగా మ్యాప్ చేశారు. రెండు రోజుల పాటు సచివాలయాల్లోనే సిబ్బంది కార్డులు అందజేశారు. దీంతో లబ్ధిదారులు సచివాలయాల వద్ద క్యూ కట్టారు. అనంతరం ఇంటింటికీ కార్డుల పంపిణీకి సచివాలయ సిబ్బంది విముఖత వ్యక్తం చేయడంతో పంపిణీకి బ్రేక్ పడింది. ఈ నెల మొదటి రెండు మూడు రోజుల్లో పెన్షన్లు పంపిణీ ఉంటుందని, తామంతా కొత్తగా బదిలీపై గత నెలలో వచ్చినందున సదివాలయ పరిధిలో నివాసాలు, డోర్ నంబర్ల మ్యాపింగ్, క్లస్టర్లు తదితర విషయాలపై అవగాహన లేక పంపిణీ కష్టమవుతుందని తమ ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రెండు రోజుల పాటు సచివాలయాల్లోనే కొద్ది మందికి కార్డులు అందజేసిన తర్వాత మిగతా కార్డులను రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేయాలని పౌర సరఫరాల శాఖ అధికారులు నిర్ణయించారు. దీంతో స్మార్ట్ కార్డులను ఆయా డిపోలకు తరలించారు. అధికారుల నిర్ణయంతో ఇంటి వద్దకే వచ్చి స్మార్ట్ కార్డులు అందజేస్తామన్న నాయకుల మాటలు గాల్లో కలిసి పోయాయి.

గంటల కొద్దీ నిరీక్షిస్తున్న కార్డుదారులు..

స్మార్ట్ రేషన్ కార్డులు ఎక్కడ ఇస్తారో తెలియక లబ్ధిదారులు సచివాలయాలకు వెళ్తుంటే ఇక్కడ కాదు రేషన్ డిపోల్లో ఇస్తారని చెప్పడంతో వారంతా వెనుదిరుగుతున్నారు. ఒకటో తారీకు నుంచి రేషన్ పంపిణీ ప్రారంభం కానుండడంతో కొత్త కార్డుల కోసం లబ్ధిదారులు రేషన్ షాపుల వద్ద ఎండనక, వాననక క్యూ కడుతున్నారు. గంటల తరబడి నిరీక్షించాల్సి రావడంతో వృద్ధులు, మహిళలు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి అన్ని సేవలు అందించేవారని, కూటమి ప్రభుత్వం వచ్చాక వలంటీర్లను తొలగించడంతో మహిళలు, వృద్ధులు, వికలాంగులకు కష్టాలు తప్పలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం దక్షిణ నియోజకవర్గంలోని 14 వార్డుల్లో ఉన్న 28 రేషన్ డిపోల పరిధిలో సుమారు 35 వేల రేషన్ కార్డులుండగా, ఇప్పటి వరకు కేవలం 30 శాతం మాత్రమే కార్డులు పంపిణీ చేసినట్టు తెలుస్తోంది. ఇప్పటికే అల్లిపురం, వెంకటేశ్వరమెట్ట, బంగారుమెట్ట, అమ్మవారివీధి, నేరెళ్లకోనేరు, కొబ్బరితోటలో రేషన్ పంపిణీ ప్రారంభం కావటంతో, కొత్త కార్డు చేతికి అందక రేషన్ ఎలా తీసుకోవాలని తెలియక లబ్ధిదారులు ఆందో ళన చెందుతున్నారు. సెప్టెంబర్ నెల రేషన్ తీసుకోవడానికి పాత రేషన్ కార్డులు పని చేయవని, వాటి ని రేషన్ డిపోల్లో అప్పగించాలని చెబుతున్నారు. రేషన్ డిపోల్లో స్మార్ట్ కార్డుల పంపిణీ జరుగుతుందని ప్రచారం జరుగుతోంది. పాత రేషన్ కార్డు, మొబైల్ ఫోన్ డిపోకు తీసుకెళ్తే ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెబితే కొత్త కార్డు ఇస్తారని.. లేదా ఈకేవైసీ చేసి తంబ్ వేయించుకుని కార్డు ఇస్తారని వస్తున్న వార్తలతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.


స్మార్ట్ రేషన్ కార్డు


స్మార్ట్ కార్డు కోసం వేచి ఉన్న మహిళ


స్మార్ట్ రేషన్ కార్డుల కోసం చలువతోటలోని ఒక డిపో వద్ద గుమిగూడిన లబ్ధిదారులు

పోర్టబిలిటీ కార్డుదారులకూ తప్పని కష్టాలు..

నగరంలో అద్దె ఇళ్లలో ఉంటున్న వారు స్మార్ట్ కార్డుల కోసం సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. చాలా మంది రేషన్ కార్డు ఒకచోట తీసుకుని, ఇప్పుడు రెండు మూడు సార్లు ఇళ్లు మారి వేరే ప్రాంతంలో రేషన్ తీసుకుంటున్నారు. తమ స్మార్ట్ కార్డు కోసం ఏ డిపోకు వెళ్లాలో తెలియక సచివాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. అలాగే ఇతర జిల్లాల నుంచి ఉద్యోగాలు, ఉపాధి కోసం వలస వచ్చిన వారు పోర్టబిలిటీ విధానంలో రాష్ట్రంలో ఎక్కడ నుంచైనా రేషన్ తీసుకునే వెసులుబాటు ఉంది. దీంతో లబ్ధిదారులు తమ సొంత ఊరు లేదా వార్డులో కార్డు ఉన్నప్పటికీ, ప్రస్తుతం వేరే ఊరిలో ఉన్నా అక్కడి నుంచే రేషన్ పొందుతున్నారు. స్మార్ట్ కార్డు మాత్రం కార్డు జారీ చేసిన రేషన్ డిపోలోనే తీసుకోవాల్సి ఉంది. ఇతర జిల్లాల్లో, దూర ప్రాంతాల్లో ఉన్న వారు స్మార్ట్ కార్డుల కోసం స్వస్థలాలకు వెళ్లాల్సి ఉంది. ఉద్యోగాలు, కూలి పనుల నిమిత్తం నగరానికి వలస వచ్చిన వారు స్మార్ట్ కార్డు తీసుకోవడానికి సెలవు పెట్టి సొంత గ్రామాలకు వెళ్లడం వ్యయ ప్రయాసలతో కూడింది కావడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాల్లో, మీ సేవా కేంద్రాల్లో కార్డు డౌన్ లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తే బాగుంటుందని దూరప్రాంతాల వారు కోరుతున్నారు.

రెండు రోజులు తిరిగా..



కొత్త రేషన్ కార్డు కోసం శంకువానిపాలెంలోని రేషన్ డిపోకు వెళ్తే అక్కడికి కార్డు రాలేదన్నారు. పాత రేషన్ కార్డు పట్టుకుని సచివాలయానికి వెళ్తే డిపోకు కొత్త కార్డు వచ్చిందని చెప్పారు. తప్పదు కనుక రెండు రోజులు తిరిగాను. చివరికి కార్డు చేతికి వచ్చింది.

– మధు, అల్లిపురం

సొంత ఊరికి వెళ్లాలంట..

మాది శ్రీకాకుళం జిల్లా. ఉపాధి కోసం కుటుంబంతో సహా విశాఖ వచ్చాను. ఇక్కడ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నా. చాలా కాలంగా చలువతోటలో గల రేషన్ డిపోలో రేషన్ సరకులు తీసుకుంటున్నా. ఇప్పుడు స్మార్ట్ కార్డు సొంత ఊరెళ్లి తీసుకోవాలంటున్నారు. రెండు రోజులు సెలవు పెడితే గానీ వెళ్లి రావడం కుదరదు.

– ఎస్.శిరీష, అచ్చియ్యమ్మపేట

క్లుప్తంగా

గణపతిని దర్శించుకున్న వాసుపల్లి


యల్లమ్మతోటలో గణపతి పూజలకు హాజరైన వాసుపల్లి తదితరులు

అల్లిపురం: జీవీఎంసీ 31వ వార్డు యల్లమ్మతోటలోని యల్లమాంబ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వరసిద్ధి వినాయక చవితి మహోత్సవాలలో నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్ వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధనలో భక్తులకు వడ్డన చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వార్డు అధ్యక్షుడు బాపు ఆనంద్, కమిటీ సభ్యులు ఉన్నారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే


గ్రాండ్ పేరెంట్స్ డేలో పాల్గొన్న తాతయ్యలు, అమ్మమ్మలు, విద్యార్థులు

అల్లిపురం: డాబాగార్డెన్స్ రవీంద్రభారతిలో శనివారం ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు తల్లిదండ్రులతో పాటు తాతయ్య, అమ్మమ్మ, నానమ్మలు పాల్గొని ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంట్లో గ్రాండ్ పేరెంట్స్ ఉంటే మనకు విలువల గురించి అవగాహన కల్పిస్తారన్నారు. కుటుంబ విలువలు దిగజారుతున్న ఈ రోజుల్లో ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్నాయన్నారు. చిన్నారులతో గ్రాండ్ పేరెంట్స్ చేసిన నృత్యాలు, ఆటపాటలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.స్వర్ణ నికిత, చిన్నారులు, గ్రాండ్ పేరెంట్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం


ఉత్తమ టీచర్లను సత్కరిస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ, శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు పరిధిలో ఉన్న జూబ్లీ, సెయింట్ జోసెఫ్ ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులను శనివారం వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ వార్డులోని ఉపాధ్యాయులకు ఆదివారం వైఎస్సార్‌సీపీ వార్డు కార్యాలయంలో సత్కార సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే వంశీతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో పలు అభివృద్ధి పనులకు వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సుమారు రూ. 93 లక్షలతో బాబుకాలనీ, స్లీప్‌గుర్తు వీధిలో రోడ్లు, కాలువల నిర్మాణం, సుబ్బలక్ష్మీనగర్‌లో సీసీ రోడ్లు, కాలువలు, తారురోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు.

మిగిలిన పనులు పూర్తి చేయాలని కోరిన కార్పొరేటర్..

వార్డులో మిగిలిన పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిశీలనకు వార్డులో పర్యటించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో జోన్-5 కమిషనర్ రాము, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్, ఇంజినీరింగ్ ఏఈ ధర్మిరెడ్డి సతీష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, జోనల్ అధికారులు, కూటమి నాయ కులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితురాలికి వాసుపల్లి ఆర్థిక సాయం


మంగం పార్వతికి ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డుకి చెందిన వైసీపీ సీనియర్ నాయకురాలు మంగం పార్వతికి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ వైద్య ఖర్చులకు రూ.5 వేలు అందజేశారు. వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ఇచ్చిన సమాచారం మేరకు వాసుపల్లి ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. పార్వతి కోలుకునే వరకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని వెల్లడించారు. మెడికల్ పరంగా ఎటువంటి అవసరం ఉన్నా తనకి నేరుగా ఫోన్ చేయమని ధైర్యం చెప్పారు. ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు పచ్చిరపల్లి రాము, విశాఖ జిల్లా బీసీ అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, ఎర్నమ్మ గుడి చైర్మన్ లండ రమణ, కల్చరల్ వింగ్ అధ్యక్షుడు సూర్యనాయుడు, హేమ, బూరుల చిన్న, చంద్రకళ, కృష్ణారెడ్డి, ఎ. బాల నారాయణరెడ్డి, జిల్లా ఆర్టీఐ సెక్రటరీ ఆరుగుల రాజు, చోడుపల్లి శివ, శ్రీ వేంకటేశ్వర టెంపుల్ చైర్మన్ బొడ్డేటి కిషోర్, కృష్ణవేణి, భాను, రామరాజు, జీవీ మహేష్, లంక సతీష్, పులి రాజు తదితరులు పాల్గొన్నారు.

బల్లిగిరికి పోటెత్తిన భక్తులు


విశేష అలంకరణలో బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం: బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు శనివారం భక్తులు పోటెత్తారు. ఏడు శనివారాల వ్రతం చేసే భక్తులు శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి తిరువీధి ఉత్సవంతో పాటు ఆలయ పరిక్రమణ అత్యంత వైభవంగా చేపట్టారు. భక్తులు స్వామితో పాటు దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఏడు పిండి దీపాలు వెలిగించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, అర్చనలు చేపట్టారు.

నేడు మధ్యాహ్నం 2 గంటల నుంచి దర్శనాలు నిలిపివేత..

సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 1.30 వరకు మాత్రమే దర్శనాలు ఉంటాయని ఆలయ అర్చకుడు రఘునాథాచార్యులు తెలిపారు. తిరిగి సోమవారం ఉదయం ఆలయ సంప్రోక్షణ, అభిషేకాల అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించనున్నట్లు తెలిపారు. అదే విధంగా నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం, శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలోను ఆదివారం మధ్యాహ్నం 11 గంటల వరకు మాత్రమే దర్శనాలు ఉంటాయ ని ఆలయ వర్గాలు తెలిపాయి. తిరిగి సోమవారం ఉదయం ఆలయ సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించనున్నట్లు తెలిపారు.

సిరులతల్లికి తులసిపూజ


తులసిపూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వ హించే తులసి పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపా రు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 080810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమావేశం


సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ఈ సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తమ తమ రంగాల్లో సాధించిన విజయాలు కళాశాలకు గర్వకారణమన్నారు. పూర్వ విద్యార్థుల విజయాలు ప్రస్తుత విద్యార్థులకు మార్గదర్శకంగా ఉండి, కళాశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు ఐసీఐసీఐ బ్యాంక్ చీఫ్ మేనేజర్ బి.మణిమాల, డిప్యూటీ తహసీల్దార్ ఎం.సువర్ణ, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు కె.నాగమణి ఇతర పూర్వ విద్యార్థులు కళాశాలలో తమ అనుభవాలను గుర్తు చేసుకుని, తమ విజయాలు పంచుకోవడంతో పాటు కళాశాల అభివృద్ధికి భవిష్యత్‌లో చేపట్టబోయే ప్రణాళికల గురించి చర్చించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, బోటనీ విభాగం అధ్యాపకురాలు టి.నివేదిత, కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ కె.గీతాంజలి, డాక్టర్ ఆర్.కిరణ్మయి, డి. అరుణపద్మ తదితర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న


34వ వార్డులో అన్నసమారాధనను ప్రారంభిస్తున్న తోట పద్మావతి


పండావీధిలో అన్నదానం చేస్తున్న 35వ వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి

అల్లిపురం: అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అన్నారు. కొబ్బరితోట, మేదర వీధిలో యల్లమ్మదేవి బాయ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన అన్నసమారాధన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె గణపతికి విశేష పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకుడు లింగం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పండా వీధిలో..

జగదాంబ: వినాయక చవితిని పురస్కరించుకుని పండా వీధిలో శనివారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్‌సీపీ 35వ వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నిదానాల కన్నా అన్నదానం గొప్పదన్నారు. యువత సేవా దృక్పథం అలవరుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నాయిని నాగభూషణరెడ్డి, నాయిని వెంకట రమణరెడ్డి, బండి అప్పనాయుడురెడ్డి, సంఘం ప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ సుంకాలపై కూటమి వైఖరి స్పష్టం చేయాలి

వామపక్ష పార్టీల డిమాండ్


నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల ప్రతినిధులు

బీచ్‌రోడ్డు: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆ దేశంలో భారతీయ సరకుల దిగుమతిపై 50 శాతం సుంకాలు విధించడాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తూ, ట్రంప్ సుంకాలను తక్షణం రద్దు చేయాలని, సుంకాలపై మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తమ వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశాయి. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. రహిమాన్, సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.మణి తదితరుల ఆధ్వర్యంలో ట్రంప్ సుంకాలను వ్యతిరేకిస్తూ శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రహిమాన్, మణి మాట్లాడుతూ అమెరికా విధించిన సుంకాల వల్ల భారతీయ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. మోదీ, చంద్రబాబు, పవణ్‌కళ్యాణ్ స్పందించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎం. పైడిరాజు, వామపక్ష పార్టీల నాయకులు ఎం.సుబ్బారావు, ఎం.మన్మథరావు, కె. దేవా, సీఎస్ క్షేత్రపాల్, ఎంఎస్ పట్నాయిక్, కె. సత్యనారాయణ, జీవీఎం రెడ్డి, ఎండీ బేగం, కొండమ్మ, కె. వనజాక్షి, వెంకటరావు, ఎ. దేముడమ్మ, వై. రాంబాబు,ఎం శ్రీనివాసరావు పలువురు వామపక్ష పార్టీల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దిబ్బలపాలెం గణపతి లడ్డూ @ రూ. 26 వేలు

వైభవంగా పసుపు గణపతి నిమజ్జనం


వేలంలో చేజిక్కించుకున్న స్వామి లడ్డూని జానకీరామయ్యకి అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు


నిలిపిన చోటే పసుపు గణపతిని నిమజ్జనం చేస్తున్న భక్తులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డు మహారాణిపేటలో దిబ్బలపాలెం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాలు శనివారంతో ముగిసాయి. ముగింపు సందర్భంగా నిర్వహించిన పసుపు గణపతి లడ్డూని వేలం వేశారు. వేలంలో లడ్డూని రూ. 26 వేలకు పూసర్ల జానకీరామయ్య చేజిక్కించుకున్నారు. అనంతరం నిలిపిన చోటే స్వామి నిమజ్జన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. పసుపు, కుంకుమ, పాలు, పెరుగు, తేనే వంటి పంచ ద్రవ్యాలతో స్వామిని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బండారు త్రినాథరావు, చిటికిరెడ్డి పవన్‌కుమార్, ఉరికిటి గిరీష్, చందక ప్రభాకరరావు, చందక ప్రవీణ్, ఎన్. శ్రీనివాసరాజు, బండారు లోకేష్, కట్టా యశ్వంత్‌కుమార్, సీహెచ్ మణికంఠ, పసగాడ రామలింగేశ్వరరావు, కళాకారులు చంటి, తాడి శ్రీధర్, మన్మథ, నార్గాన కల్యాణ్, దాసరి రమేష్, తేజ, భానుకుమార్, గౌతమ్, టైలర్ చిన్న, రాజు, అనిల్, ఆటో మణి, డీటీడీసీ శ్రీను, నర్సింహమూర్తి, కృష్ణ, త్రినాథ్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

మర్రిపాలెం : భార్య కనిపించడం లేదంటూ భర్త కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఊర్వశి దరి గౌరీనగర్ ప్రాంతంలో భార్య దివ్య, కుమార్తెతో కలిసి జి.శ్రీను నివసిస్తున్నాడు. శ్రీను సెక్యూరిటీ గార్డుగా పని చేస్తుండగా దివ్య ఇంటి పనులు చేస్తుండేది. ఈ క్రమంలో ఈ నెల 4న శ్రీను రోజూ మాదిరి డ్యూటీకి వెళ్లిపోయాడు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల సమయంలో అతని సోదరుడు ఇంటికి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేకపోవడంతో శ్రీనుకు ఫోన్ చేశాడు. వెంటనే దివ్యకు శ్రీను ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో అంతటా వెతికినా ఆచూకీ లభించలేదు. కంచరపాలెం పోలీసులను ఆశ్రయించడంతో శ్రీను ఫిర్యాదు మేరకు సీఐ రవికుమార్ నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ అబద్ధం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ

సీతంపేట : అక్కయ్యపాలెంలోని శ్రీలలితా పీఠంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు స్వామి వారిని, ఉత్సవమూర్తులను విరజాజులు, గులాబీలు, కనకాంబరాలతో చూడ ముచ్చటగా అలంకరించారు. పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు చేశారు. ఉదయం సుప్రభాత సేవ, సాయంత్రం భక్తులు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. అనంతరం విశేష హారతులిచ్చారు.

గుంటూరు గంగరాజుకు ఆత్మీయ వీడ్కోలు


పదవీ విరమణ చేసిన గంగరాజుతో 108 సిబ్బంది

మహారాణిపేట: 108 అంబులెన్స్ సర్వీస్ పైలెట్‌గా పని చేసి పదవీ విరమణ చేసిన గుంటూరు గంగరాజుకు శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. రేసవానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో గంగరాజు దంపతులను సత్కరించారు. క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వర్తించి, అంచెలంచెలుగా 108,104,102 సర్వీసులకు జిల్లా ఫ్లీట్ మేనేజర్‌గా, జోనల్ ఫ్లీట్ మేనేజర్‌గా అందరి మన్ననలు అందుకున్నారని కొనియాడారు. జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో భాస్కరరావు, జిల్లా మేనేజర్ సురేష్, మన్మథనాయుడు, రామకృష్ణ, నవీన్, సమీర్, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నానికి చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాళీ కాలభైరవ కల్యాణ మహోత్సవం నేడు


శ్రీలలితా పీఠంలో కొలువైన కాళీకాలభైరవులు

సీతంపేట : పౌర్ణమి సందర్భంగా ఆదివారం ఉదయం 9.30 గంటలకు శ్రీలలితాపీఠంలో కాళీ కాలభైరవ కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. శ్రీలలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి స్వామి ఆశీస్సులతో ఏటా భాద్రపద పౌర్ణమి నాడు కాళీ కాలభైరవుల కల్యాణం జరిపిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నప్రసాదం పంపిణీ చేస్తామని తెలిపారు. అలాగే చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం గ్రహణ శాంతి హోమం నిర్వహిస్తామని తెలిపారు.